# వరం

సింగిల్ పేజీ కథ

- రాగూరు బాలమురళీకృష్ణ



రాముూ నిద్రపోతున్నట్లున్నాడు.

వాడి మొఖం బేలగా నావైపే చూస్తున్నట్లని పించింది!

నా కళ్ళలో నీళ్ళు జలజలా రాలాయి.

వాణ్ణి నేనెందుకొట్టాలి. ఏదో ఒక పరీక్షలో తక్కువ మార్కులొచ్చినంత మాత్రాన వాణ్ణి ఎడాపెడా వాయించడమేనా? రేపు ఎప్పట్లా వాడు నామెడ చుట్టూ చేతులు వేసుకుని నా బుగ్గమీద ముద్దుపెడ్తాడో లేదో?

వాణ్ణి అప్పటికప్పుడు లేపి "మీ అమ్మ నిన్ను ఇంకెప్పుడూ కొట్టదంట! ఎందుకంటే నువ్వు అమ్మకు ప్రాణం, అమ్మకు మంచి దోస్తువి... అందుకని అసలు నిన్నెప్పుడూ కొట్టదంట!" అని రామూకు చెప్పాలని పించింది.

"అమ్మా నన్ను కొట్టద్దమ్మా! ఇంకో పరీక్షలో మంచి మార్కులు తెచ్చుకుంటానమ్మ... కొట్టద్దమ్మ... ఒద్దమ్మ..."

రామూ కలవరిస్తున్నాడు. కలవరించేప్పుడు వాడు ఎంతగా భయపడుతున్నాడో... నేను కొట్టిందానికి ఆ చిన్ని మనసు ఎంతగా బెదిరి పోయిందో చూస్తుంటే నా మీద నాకే కోపం, అసహ్యం కలిగాయి.

ఒక్కసారిగా వాణ్ణి ఎత్తుకుని నా గుండెలకు అదుముకున్నాను.

"నొప్పిగా ఉందమ్మా" నిద్దట్లోనే మాట్లాడుతున్నాడు రామూ.

వాడికి బాగా ఉక్కపోస్తుంటే చొక్కా విప్పేసి పడుకోబెట్టాను.

నేను కొట్టిన తాలూకు చేతి గుర్తులు శరీరంమీద ఎర్రగా నావైపే చూస్తున్నాయి!

లేత శరీరం పైన ఎర్రగా ఆ చారల్ని చూస్తుంటే నా గుండెను పట్టి రంపంతో కోసినట్లైంది.

క్షణికావేశంలో వాణ్ణి అంతగా బాదేసేమో... ఒక్కక్షణం నా ఆవేశాన్ని అదుపుచేసుకోలేక పోయానే.... ఎందుకలా పశువులా బాదేశాను! వాడు నా కన్నా చిన్నవాడనా? లేక నన్ను ఏమీ చేయలేడనా... దుఃఖం తన్నుకు వచ్చింది!

ఆ రోజు అలా వాణ్ణి కొట్టానన్న నిజాన్ని జీర్ణించుకోలేక నా కళ్ళు మూసుకున్నాను.

★ ★ ★

పాలవాడి అరుపులకి మెలకువొచ్చింది. పాలుతీసుకుని స్టవ్ వెలిగించి కిందకూర్చున్నాను.

నా చిన్నారి లేత చేతులు నా మెడను చుట్టేశాయి! అదేముద్దు... నా బుగ్గల మీద!

ఆ ముద్దులో... ఏ మాత్రం ప్రేమ పాలు తగ్గలేదు!

"రామూ, అమ్మమీద కోపం పోయిందా?" అడిగాను.

"నాకు పాలు కావాలి!" గోముగా అడిగాడు రామూ.

అన్నీ మర్చిపోయి... వాడు హాయిగా నాతో ఆడుకుంటున్నాడు.

పిల్లలకు మతిమరుపు సహజం. ఆ మతిమరుపు ఒద్దనే నేను కొట్టాను.

కానీ వాడి ఆ మతిమరుపే... ఇప్పుడు నాకో వరమై నా గుండెను ఆర్ద్రం చేసింది.

★